

# అగ్రహారం కథలు

## వేదుల సుభద్ర



పేరులో ఒకరకమయిన రాజసాన్నీ, కొంత గాంభీర్యాన్నీ సంతరించుకుని ఆంధ్రదేశమంతటా ఉన్న చిన్న చిన్న గ్రామాలే అగ్రహారాలు. ఎదురెదురుగా చిన్నదీ, పెద్దదీ రెండు రాములవారి గుళ్ళూ, ఆ ఊరిదేవుడి కాళ్ళు నిత్యమూ కడుగుతూ అప్పుడప్పుడు వొద్దికగానూ, మరోప్పుడు కాస్త ఉగ్రంగానూ ప్రవహించే కౌశిక గా పిలవబడే గోదావరి, వెనకే పచ్చదనాల నెచ్చెలులు వరిచేలూ, వాటికి కాపలాగా నిలుచున్న అన్నదమ్ముల్లాంటి కొబ్బరి చెట్లూ, ఇలా ఎంతో మనోహరంగా ఉన్న చోట ఎదురెదుగా రోడ్డుకిరువైపులా ఉన్న ఓ పాతిక ఇళ్ళని కలిపి ఒక ఊరుగా కట్టేస్తే అదే ఈ అగ్రహారం. అమ్మమ్మగారి ఊరు కావడమే కాకుండా, మరుగున పడుతున్న ఆచారవ్యవహారాలనీ, సంప్రదాయాలనీ, అనుబంధాలని మాకు రుచిచూపించింది కూడ అగ్రహారమే. చిలిపితనాల చిన్నతనాలూ, కలల అలల కౌమారాలూ, జీవితాన స్థిరపడే ప్రయత్నంలో ఉద్యోగాలూ, సద్యోగాలూ, పెళ్ళిళ్ళూ, పేరంటాలూ ఇలా రకరకాల మెట్లు ఎక్కుతూ దిగుతూ మధ్యలో ఎక్కడో, ఎప్పుడో తెలియకుండానే పారేసుకున్న అమ్మ పెట్టిన కమ్మనైన తాయిలం లాంటి ఆ ఊరి జ్ఞాపకాలు ఇవి. మన ఇంట్లోనో, పక్కనో కనిపించి పలకరించే వ్యక్తుల్లాంటివే ఈ కథల్లో పాత్రలు. కొన్ని జరిగినవి, కొన్ని నే విన్నవీ , వీటికి కొద్దిగా నా సొంత కవిత్వాల రంగులూ, వర్ణనలూ, ఊహలు అద్దేసి ఆ చేనే(రా)తల కలనేతకి నేను పెట్టుకున్న పేరు అగ్రహారపు కథలు. - *రచయిత్రి(బెంగుళూరు)*

## మిషన్ సూరన్న

**రాధిక** కి అప్పుడు పన్నేండేళ్ళు. వాళ్ళ నాన్నా అమ్మా ఇంకో ఊరికి ట్రాన్స్‌ఫర్ అయ్యి వెళుతూ, సెలవులే కదా అని రాధికని వాళ్ళ అమ్మమ్మగారైన సుగుణమ్మ గారింటికి పంపించారు. ఎప్పుడైనా బొంబాయి నుంచి తల్లితో వచ్చి రెండు మూడు రోజులుండి వెళ్ళిపోయే ఆ పిల్లకి పల్లెటూరు కొత్తే అని చెప్పచ్చు. ఈ సారి సంక్రాంతి సెలవులు పది రోజులూ ఇక్కడే ఉండవచ్చు అన్న ఊహే బావుంది. తను వచ్చేసరికే మావయ్యగారి పిల్లలు భోగి పిడకలు వేసి, వాటిని జాగ్రత్తగా విరిగిపోకుండా దండలు కట్టి, అన్నింటికంటే పెద్దదైన దండ రాధిక కోసమే ఉంచారు. వాటిని చూస్తే 'ఇది పేడతో చేసిన దండ అనే అనిపించదు ఎందుకో మరి '! పల్లెల్లో సంక్రాంతి హడావుడి నెల పట్టడంతో ప్రారంభం అవుతుంది. ఇంటి ముందరి వాకిళ్ళు కొడవళ్ళతో చక్కగా గడ్డి లేకుండా చెక్కించి, శుభ్రంగా రోజూ తుడిచి, పచ్చని పేన్నీళ్ళతో కళ్ళాపు చల్లితే చక్కని రంగం రెడీ, ముగ్గు వెయ్యడానికి.

'భోజనాలు చేసేసి వెళ్ళండే, ఆలస్యమయినా బాధ లేదు' అనే పెద్దవాళ్ళు. ఆనక ఆకలేస్తే జంతికలో, బెల్లం మిఠాయో ఉంటాయి కదా, ఆ ధైర్యం తోనే అన్నాలు తినేసి వాకిట్లోకి ప్రవేశించేసరికి ఏడు గంటలయింది.. మావయ్య కూతురు బేబి ముగ్గులు చక్కగా వేస్తుంది. ఆ అమ్మాయి సన్నటి తెల్లటి వేళ్ళ మధ్యలోంచి మెరుపుతీగల్లాగ ముగ్గు జారి రకరకాల ఆకారాలు గా రూపు దిద్దుకుంటుంటే మరీ మరీ చూడాలనిపిస్తుంది రాధిక కి. తను ఉండే బొంబాయి లోని ఆకాశహర్మ్యాలలో నేల మీద ముగ్గు వేసే అవకాశం లేనేలేదు. వెయ్యాలని ఉన్నా ఆకాశం అందదు. తనూ ఒక కొబ్బరిచిప్పలో ముగ్గు తీసుకుని చిన్న చిన్న చిలకలూ, మావిడాకులు ఇలాంటివి వేసేది, బేబి వేసే వాటికి అడ్డు రాకుండా.

చామంతులూ, గులాబీపువ్వులతో పూలజడలు వేసుకోవడం అంటే అందరికీ సరదానే. చిన్నమావయ్య భార్య లక్ష్మత్త రకరకాలజడలు వెయ్యడంలో ఎక్స్‌పర్ట్. నాగరం జడా, ఈత పాయల జడ, ఇలా ఎన్నో వేసి పూలజడలు కూడా కుట్టేది. భోగి మంటలూ, భోగి పళ్ళూ, బొమ్మలకొలువులూ, ప్రభల తీర్థం, కోడి పందాలూ, తెలుగింటి కాంతి సంక్రాంతి అయితే అమ్మమ్మగారింట్లో సంక్రాంతికి కొత్తబట్టలు కొనే తీరు మాత్రం రాధిక కి పెద్దగా నచ్చేది కాదు. ఎంత ముందర చెప్పినా సరే అమ్మమ్మ తనంత తనుగా బజారు వెళ్ళదు. వీధిలోకి వచ్చి అమ్మే మూటలతని దగ్గరే కొనుక్కోవాలి. ఎప్పుడు కావాలంటే అప్పుడు వీలైతే లోకల్ ట్రయినో, లేకపోతే బస్సో ఎక్కి ఏం కావలన్నా తనూ అమ్మా చిటికెలో తెచ్చేసుకుంటారు బొంబాయిలో. మరి ఇక్కడ ఆడవాళ్ళు ఇల్లు కదలాలంటే ఒక పెద్ద ప్రయాణం. ఇంక చేసేదేముంది. మూటలవాడు ఎప్పుడు వస్తాడా? అని ఎదురుచూడడం తప్ప

మూటలతను రోజూ ఒకే వేపు తిరగడు, అన్ని ఊర్లూ తిరుగుతూ ఓ నాలుగు రోజులకోసారి అలా ఇటువేపు వస్తే గొప్ప. అందుకే అతనికోసం వీధిలో కాపలా కూర్చోవాలి. 'అన్నం తినడానికి లోపలికి వెళ్తే, ఈ లోపులో వెళ్ళిపోతే?? ' అందుకే బేబీ, రాధికా వంతులవారీగా అన్నం తినేవారు. ఇలా ఓ నాలుగు రోజులు చూసాకా ఒకరోజు కనిపించాడు. సైకిల్ వెనక్కాల పెద్ద మూటానిండా బట్టలూ, ముందు హాండిల్‌కి రెండు పక్కలా సంచీలలో జాకెట్ బట్టలూ వగైరాలు పెట్టుకుని . ' అమ్మమ్మా! అతనొచ్చాడు.. తొందరగా రా!' దాదాపు అరిచింది రాధిక. ఈ లోపున బేబి అతన్ని పిలవనే పిలిచింది. అరుగు మీద చాప వేసాకా, అతను నిదానంగా తెల్లటి చేతిరుమాలుతో తన చేతులు తుడుచుకుని అప్పుడు మెల్లగా మూట విప్పాడు.

అతనొచ్చిన సంగతి ఎంత వేగంగా ఊరంతా పాకేదంటే మూట మొత్తం విప్పేలోపునే ఇరుగూ, పొరుగూ చేరారు.

'చిన్నాళం పట్టు పరికిణీ చాల బావుంది కదే' అని బేబి అంటే,

' కాఫీ కలర్ పరికిణీ గుడ్డ ఇంకా బావుంది కదూ' అని పక్కవాళ్ళ కాసి అన్నది.

అమ్మమ్మ తీరిగ్గా వచ్చి అన్ని ముట్టుకుని చూసి, ' గజం పన్నానా? చీర పన్నానా? ' అని అడిగింది.

'అదేంటండీ అమ్మగారు అంత మాట అనేసారు? ఏనాడైనా గజం పన్నాలూ, చీటీ గుడ్డలు అమ్మానాండీ?' అన్నాడు.

సరే మొత్తానికి పసుపు రంగుకి ఎరుపంచు ఉన్న పరికిణీ తనకీ, ఆకుపచ్చకి గులాబి అంచు ఉన్నది బేబి కి అందరి ఆమోదంతో సెలక్షన్ అయింది. ఇక అప్పుడు అమ్మమ్మ బేరం మొదలు. 'ఎంత చెప్పావయ్యా? ' అని అడగ్గానే

అతను 'మీకు తెలియందేముందండీ? మూడు వందలు' అన్నాడు.

'ఏమిటీ? మూడు వందలే? కంచి పట్టు రేటా? ఇచ్చే బేరం చెప్పు మరీ, రెండు కావాలి కదా' అంది అమ్మమ్మ.

'మీ కాడ బేరాలా అమ్మా? సరేలెండి, రెండిటికి కలిపి 500 చేసుకోండి'అన్నాడు..

'అబ్బే! రెండు వందలా యాభై ఇస్తాను రొండు గుడ్డలకీ కలిపి' అమ్మమ్మ అంది.

రాధిక గుండెల్లో బాంబు పేలింది, 'అమ్మమ్మా? ఇది కుదిరే బేరమేనా? ఎందుకు అంత తక్కువ అడుగుతావు? ' అమ్మమ్మ చెవిలో గొణిగింది రాధిక.

'నువ్వుఊరుకో! నీ మొహం, నీకేమీ తెలియదు ' అని కసిరింది.

అతను ఇవ్వకుండా వెళ్ళిపోతే? అని ఒకటే భయంగా ఉంది రాధికకి. నాయనమ్మ బేరసారాలు తెలిసిన బేబి ధైర్యంగానే ఉంది. మొత్తానికి 320 వందల దగ్గర ఆగింది బేరం. 'నా వొత్తుల పెట్టిలో. '. అమ్మమ్మ మాట పూర్తి కాకుండానే డబ్బు తెచ్చి ఇచ్చింది రాధిక.

'రంగు వెలిసిపోయినా, గుడ్డ లాగేసినా మళ్ళీ వచ్చినప్పుడు ఇచ్చేస్తాను సుమా! 'అని బెదిరించింది అమ్మ. బదులుగా చిరునవ్వు నవ్వాడు. తరవాత అమ్మమ్మ ఇచ్చిన రాగిచెంబుడు మజ్జిగ తాగేసి వెళ్ళిపోయాడు. అమ్మయ్య బట్టలు కొనడం అయింది, ఇంక కుట్టించుకోవడమే మిగిలింది.

'మన సూరన్న కిచ్చి రా్రా!' అంది అమ్మమ్మ.

'సూరన్నకా? ఎప్పుడూ తొందరగా ఇవ్వడు కదా! ' బేబి అంది.

' పరవాలేదు, మా నాన్నమ్మ చెప్పింది అని చెప్పు, ఇచ్చేస్తాడు 'అనేసి ఆవిడ పెరట్లోకి వెళ్ళిపోయింది.

అగ్రహారానికి ఉన్న ఏకైక టైలర్ సూరన్న, అతనిని అందరూ మిషన్ సూరన్న అనే పిలుస్తారు. సూరన్నకి యాభై అయిదు పైనే ఉంటుంది వయసు. తాతలనాటిది ఒక చిన్న ఇల్లు, వెనక కాయలు కాసే పది కొబ్బరి చెట్లు. ఒక ఆవు అతని ఆస్థి. పిల్లలు లేరు. - ఆరోగ్యం సహకరించకపోయినా ఇల్లు గడవడానికి బట్టలు కుడుతూ ఉంటాడు, భార్య పైపని చేస్తూ ఉంటుంది.చెప్పిన టైముకు ఇవ్వడం తప్ప మిగతావన్నీ బానే చేస్తాడు.

' పరికిణీ పొడుగ్గా ఉందేం?' అంటే

'ఎప్పటికీ ఇంతే ఉంటారేటండే? సిటికెలో పొడుగైపోరూ, ఆనక డబ్బుపోసి కొన్నాం ఆర్నెల్లు కూడ కట్టలేదు అంటారు ' అంటాడు,

అదే 'కొద్దిగా పొట్టి అయిందేం' అంటే?

'ఎబ్బే! మరీ పొడుగుంటే బాగోదండే! కాళ్ళకడ్డం పడుద్ది, పైగా మన ఊరంతా బాడీ, బందానూ 'అంటాడు.

చాలా నిజాయితీపరుడు. పొరపాటున కూడ ఎవరిదీ పదిపైసలు ఉంచుకోడు. ఒక్కపైసా కూలీ ఎక్కువ అడగడు. ఊరికే సాయం పొందటం అంటే అతనికి విషంతో సమానం

రాధిక, బేబి కలిసి అతనింటికి వెళ్ళేసరికి సూరన్న మిషన్‌కి ఆయిల్ వేస్తున్నాడు. ఆ మిషన్ చూసి రాధిక కి భయం వేసింది. ఇదసలు కుట్టు మిషనేనా? అని. చాలా పాతకాలం నాటిది. తనకి తెలిసిన మిషన్లలోని ఏ ఒక్క భాగం కూడ దీనిలో ఉన్నట్లుగా తోచలేదు ఆమెకి.

'ఏటండోయ్ బేబమ్మగారు! కొత్తబట్టలట్టుకొచ్చేసినారేటి? ' నవ్వుతూ అన్నాడు... రాధికని చూసి మళ్ళీ తనే

'ఈరు మన అత్తయ్యగారి అమ్మాయిగోరు కదండీ?' అన్నాడు.

'అవును. మా ఇద్దరికీ పరికిణీలు, జాకట్లు కుట్టాలి, భోగి నాటికే, పేరంటానికి కావాలి' అంది బేబి.

'భోగి పండగ ఎల్లుండి కదండే! రేపు సాయంత్రానికల్లా అయిపోద్ది చూడండి' అన్నాడు.

'ఇప్పుడు ఇలాగే అంటావు, ఇచ్చేటప్పుడు మాత్రం వంద సార్లు తిప్పించుకుంటావు' అంది బేబి కొంచం కోపంగా.

'రేపీపాటికొచ్చేయండి మరి తీసుకుపోదురుగాని' అన్నాడు. 'పచ్చది పాపగారిది, ఇది మీది' అని చాల ఎత్తుగా పెద్దగా ఉన్న బల్లమీద వాటిని పెట్టి ఇద్దరివీ కొలతలు తీసుకున్నాడు, మెళ్ళో వేళ్ళాడుతున్న టేప్ తో. చెవులో పెట్టుకున్న పెనిసిల్ తో పుస్తకంలో రాసుకున్నాడు అవన్నీ.

'కొలతలైపోయాయి కదా, కత్తిరించేయ్' అంది బేబి.

'అయ్యబాబోయ్! గుడ్డ తడపకుండా కుట్టేస్తే ఆపైన లాగేస్తే నాయనమ్మగారుకుంటారేటండి, ఇప్పుడే తడిపేసి ఆరగానే కత్తిరించేద్దారి, మాలచ్మీ! ఈ పరికిణీ గుడ్డలు తడిపి ఆరెయ్యి' అన్నాడు.

ఆయిల్ వేసిన మిషన్‌ని నడుపుతూ పరిక్షించసాగాడు. దాని చక్రానికి తోలు బెల్ట్ లేదు, రకరకాల గుడ్డపీలికలు కలిపి పేనిన తాడు కట్టి ఉంది. దాంతో ఆ మిషన్ ఎలా తిరుగుతుందో, అతను ఎలా బట్టలు కుడతాడో అనేది ఒక పరిశోధనకి పనికి వచ్చే వ్యాసమవుతుంది ఎవరికైనా ఓపిక ఉండి రాస్తే.

బట్టలు ఇచ్చేసి బయలుదేరారు బేబి, రాధిక. నేను 'నా జాకట్ కి బుట్ట చేతులు పెట్టమన్నాను' అని ఒకరూ, 'నేనేమో రెక్కల చేతులు పెట్టమన్నాను' అని మరొకరూ రాత్రంతా మాట్లాడుకుంటూనే ఉన్నారు. మర్నాడు ఇల్లు దులపడం, కడగడం, సుద్దముక్క తో ముగ్గులు పెట్టడం అయ్యింది. 'పోలి పూర్ణం బూర్లు చేస్తాను' అని అమ్మమ్మ పప్పు నానపోసింది.

సాయంత్రం ఇద్దరూ మొహాలు కడుక్కుని పరుగున వెళ్ళారు లంగాలు తెచ్చుకోవడానికి. వెళ్ళేసరికి రెండూ లోపల కర్ర దండెం మీద వేళ్ళాడుతూ ఉండడం చూసేసరికి వాళ్ళిద్దరికీ కోపం వచ్చింది.

'ఏం సూరన్నా? సాయంత్రం ఇచ్చేస్తానన్నావ్ కదా? ' అన్నారు కోపంగా.

'అయ్యబాబో! అంత కోపం ఎందుకండే? ఇప్పుడు మీదే కత్తిరింపేస్తున్నాను, రాత్రికి కుట్టేసుంచేస్తాను, రేప్పొద్దున్నే వచ్చేయండి' అన్నాడు.

విసుక్కుంటూనే వెనక్కు మళ్ళారు.

మంచు ముగ్గుల మధ్య మెల్లగా తెలతెలవారుతుండగానే అత్తయ్య నిద్ర లేపింది. 'లేవండే! తలంట్లు పోసుకోవాలి కదా' అని. అంత చలిలో పొద్దున్నే లేచి నువ్వుల నూనే వళ్ళంతా రాసుకుని, సున్నిపిండి, పసుపు కలిపి నలుగు పెట్టుకుని స్నానం చేస్తే ఏ క్రీములూ, ఫేస్ పాక్ లూ పనికిరావు. అలాగే రోట్లో కుంకుడు కాయలు, మందారాకులు కలిపి మెత్తగా కొట్టి వేడి నీళ్ళలో నానబెట్టి తల రుద్దుకుంటే జుట్టు పట్టులా మెరిసిపోయింది. నూనె రాసుకున్నాకా ఇద్దరూ భోగి దండలు, భోగి మంటలో వేసి అవి కాలి, అవే - ఆకారంలో మిగలడం, చేతితో తాకగానే బూడిద గా విడిపోవడం ఓ తమాషా. సూరన్న ఇంటికి పరిగెత్తారు. కత్తిరించి ఉన్న బట్టలని చూసేసరికే సగం ఆనందం వేసింది వాళ్ళకి. 'అయినా పైకి ఇంకా అవలేదా? ' అన్నారు. 'అయిపోయిందండే! పేరంటం మధ్యాహ్నం కదండే, అప్పటికయిపోద్దిలెండి' అన్నాడు. తాపీగా. కాళ్ళీడ్చుకుంటూ ఇంటికొచ్చారు.

మళ్ళీ పదకొండు గంటల వేళప్పుడు వెళ్ళారు సూరన్న ఇంటికి 'కుట్టకపోతే ఇచ్చేయమన్నారు' అంటూ.

'ఇదిగో పరికిణీలయిపోయాయి. పొడుగదీ, చూసుకోండి, ఫిల్టీ లు వేసేద్దాం. మీరు బూరెముక్కలేసుకుని అన్నం తినేసి వచ్చేయండి, చక్కగా ఇచ్చేస్తాను, ఏసేసుకుని పేరంటకాలకెల్లిపోవడమే' అన్నాడు.

తగని విసుగుతో ఇంటికొచ్చారు.

'ఎన్ని సార్లు తిరుగుతారే ? అక్కడకి ఇక్కడకీ, ఇవ్వకపోతే పట్టుపరికిణీలు వేసుకుందురుగాని' అంది అమ్మమ్మ.

భోజనాలు అయ్యాక అందరూ పడుకున్నాక మెల్లగా ఇంట్లోంచి జారుకున్నారు.

సూరన్న చక్రంలో తాడు పెడుతున్నాడు.

'రెండు గంటలవుతున్నాది, అన్నానికి లెగవా? ' మాలచ్మి అడుగుతోంది.

'పాపం పాపగార్లిద్దరూ పాత పరికిణీలేసుకుయెలతారేంటే? పేరంటకాలకి. భోగి పండగంటేనే చిన్నపిల్లల పండగ. కుట్టిచ్చేసి తినేత్తాలే, ఇది ఆగితే మళ్ళీ తిరుగుద్దో లేదో? చక్రం వంక చూస్తూ' అన్నాడు.

'అదికాదయ్యా, నీకు ఉబ్బసం మళ్ళీ తిరగబెడుతోండి కదా, రాత్రల్లా నిద్రోలేదు నువ్వు' అన్న ఆమె మాటలని మధ్యలోనే ఆపేసి. 'ఏహే! అయిపోయిందన్నానా, ఇంకా ఒకటే నసా!' విసుక్కున్నాడు, ఆమె నోరు మూయించడానికి.

'చూడండే అమ్మాయిగారు, ఇదీ వరస'. అంది మాలచ్మి జాకెట్లు అయిపోయాయా? అని అడుగుతున్న బేబితో.

'ఇదిగో! అయిపోయిందండే, చేతిపని ఒక్కటే మిగిలింది. మాలచ్మి వీటికి బొత్తాలేట్టేయ్యవే' అన్నాడు. 'ఓ ఘుడియాగొస్తారేటండే? అన్నాడు

'వీల్లేదు, మేము ఇక్కడే కూర్చుంటాం. నువ్విచ్చేవరకూ'. ఇద్దరూ కత్తిరింపుల బల్ల ఎక్కి కూర్చున్నారు కాళ్ళూపుకుంటూ.

'సర్లే కాజాలు బొత్తాలు నేనేత్తా, కాని నువ్వు కాసింత అన్నం తిను అంది' మాలచ్మి లోపల నించి వస్తూ, కొంగుతో చేతులు తుడుచుకుని పని మొదలు పెట్టింది. ఒక అరగంటలో పని పూర్తి అయ్యింది. తను పని చేస్తుంటే, సూరన్న లంగాలకి ఫిల్ట్‌లు వేసాడు. ఇవన్నీ పూర్తి అయ్యేసరికి మూడు అయ్యింది. అప్పుడు లేచాడు సత్తుపళ్ళెంలో అన్నం తినడానికి. బేబి, రాధిక పరికిణీలు తీసుకుని తూనిగల్లాగ పరిగెత్తారు. బాగాకుదిరిన పరికిణీలూ, జాకట్లు చూసుకుని మురిసిపోయారు. పేరంటాలకి వెళ్ళిపోయారు.

ఇది జరిగి సరిగ్గా పన్నేండేళ్ళు. మధ్యలో తండ్రికి అమెరికా వెళ్ళవలసి రావడంతో రాధిక అమ్మా నాన్నలతో అమెరికా వెళ్ళిపోయింది. మధ్యలో మళ్ళీ సంక్రాంతి కి అగ్రహారం రాలేదు రాధిక. మావయ్యలు పట్నం లో వ్యాపారం పెట్టి దానికోసం, పిల్లల చదువులకోసం అని అక్కడకే మకాం మార్చారు. అందుకే ఎప్పుడు వచ్చినా అక్కడ అందరినీ కలవడం. ఈ మధ్యనే తాతగారు 'నేను పెద్దవాడిని అయిపోతున్నాను, ఉన్నవూరు కన్నతల్లి అన్నారు, మేమిద్దరం అక్కడకి వెళ్ళిపోతాం' అని గొడవ చెయ్యడంతో పెద్ద మావయ్య అత్తా కూడా వాళ్ళకి తోడుగా వచ్చేసారు పోయినేడాది. ఇప్పుడు బేబి పెళ్ళి సొంత ఇంట్లో జరగాలని తాతగారి పట్టు. అందుకే వెళుతున్నారు . ఇప్పుడు మళ్ళీ ఇన్నేళ్ళకి సంక్రాంతి కి అమ్మమ్మగారి ఊరు వస్తున్నందుకు రాధికకి ఎంతో సంతోషంగా ఉంది అందులో బేబి పెళ్ళి మాఘమాసంలోనే. అప్పటివరకు ఉందామనే రాధిక ఉద్దేశ్యం.

సంక్రాంతి జ్ఞాపకాలు రాగానే అందులో మొదటిస్థానం సూరన్నదే ఒక లంగా జాకెట్ కుట్టించుకోవడానికి అప్పుడు పడ్డ కష్టం మళీ ఎప్పుడూ పడలేదు, ఏ బట్టలు కుట్టించుకోవడానికీ కూడ. అంత ఆనందమూ పొందలేదు... 'వచ్చే రెండు వారాలవరకూ నాకు ఖాళీ లేదు, మీ బట్టలు తీసుకోవడానికి' అనే దర్జీలనీ, 'నేను వచ్చే నెలలోనే ఇవ్వగలను, మీకిష్టమైతే ఇచ్చి వెళ్ళండి' అనే డిజైనర్లనీ చూసింది తను బొంబాయిలో. కానీ ఇద్దరు చిన్నపిల్లల కోసం పొద్దున్నించీ తిండీ తిప్పలూ మానేసి పదిరూపాయలైనా అడగకుండా, పట్టుదలగా కుట్టిచ్చిన సూరన్న ని రాధిక ఎప్పుడూ మర్చిపోలేదు.

'ఒకసారి వెళ్ళి చూసి రావాలి సూరన్న ఎలా ఉన్నాడో' అనుకుంది.

'నీ బట్టలు సూరన్న తో కుట్టించుకోవట్లేదా? ' అని అడిగింది బేబిని.

'చాల్లే తల్లీ! ఇన్నేళ్ళయ్యాకా కూడ అతనితోనేనా, ఇప్పుడంతా అమలాపురం లోనే, కొత్త మోడల్ లో జాకట్లు అవీ కుట్టేవాళ్ళు బోలెడు మంది అక్కడ, ఇప్పుడు ఆటోలూ, బస్సులూ ఎలా కావాలంటే అలా, ఎప్పుడంటే అప్పుడు వెళ్ళి రావచ్చు, మన చిన్నప్పట్లా కాదు ' అంది బేబి నవ్వుతూ. 'పెద్ద వయసుతో పాటు సూరన్నకి చాదస్తం బాగా పెరిగిపోయింది. ఎప్పుడూ మిషన్ ముందే కూర్చుని ఏదో ఒకటి కుడుతూనే ఉంటాడు, ఎవ్వరూ ఏమీ ఇవ్వకపోయినా సరే. కొత్త టైలర్లు వచ్చాక తననెవరూ చూడటంలేదని కొంచం పిచ్చిఎక్కిందేమోనని అనుమానం కూడ', బాధగా చెప్పింది బేబి.

వెళ్ళిన రోజు సాయంత్రం రాధిక తనకి మావయ్య కొన్న చీర జాకట్ తీసుకుని సూరన్న దగ్గరకి వెళ్ళింది. సూరన్న అదే మిషన్ ముందర కూర్చుకు ఎవరిదో తెల్లది బనీను కాబోలు కుడుతున్నాడు. అదే ఇల్లు, అదే మిషన్, రవ్వంత కూడ మార్పు లేదు అతని జీవితంలో.. ఇది రాధిక కి మొదట తోచిన మాట. 'పెరుగుతున్న ఎకానమీలూ, ఈ ప్రపంచీకరణలూ (గ్లోబలైజేషన్) మారుతున్న ఆర్థిక వనరులూ ఇవన్నీ ఇలాంటి జీవితాల మీద ఎప్పుడు ప్రభావం చూపిస్తాయో మరి!. ప్రపంచంలో వచ్చిన మార్పులలో ఏ ఒక్కటి వీళ్ళని తాకలేదు' అనుకుంటే చాలా ఆశ్చర్యం వేసింది రాధిక కి. వీళ్ళిద్దరినీ చూడగానే మాలచ్మి లేచి 'రండి రండి పాపగారూ, అత్తయ్యగారి

అమ్మయిగారోనా? అమ్మగారు బాగున్నారా?' అని పలకరించింది. మిషనే కాదు, వాళ్ళ మాట తీరు, ఆప్యాయతల్లోనూ ఏమీ మార్పు లేదు.

'అవును అదే! సూరన్నతోనే కుట్టించుకుంటుందిట దాని బట్టలు' అంది బేబి నవ్వుతూ.

'చూస్తున్నారుగదండే! ఎవ్వరూ ఇవ్వట్లేదని తన పాత బనీను మళ్ళీ కుడతన్నాడు. ఏటో కుట్టుపని లేక చనం ఉండలేడు, ఈ కొత్త కుర్రోళ్ళ ఫాషన్లు మనకొత్తాయా సెప్పండి, మానెవయ్యా అంటే మాటినడు. పైగా ఆరోగ్గెం బాగోట్లేదండే, మీకు తెల్సు కదండే అంతానూ' అంది బేబితో 'తాతయ్యగారిలోంటోళ్ళు ఏదైనా సాయం సేస్తామంటే ఊరికే తీసుకోవడం వల్ల కాదు అంటాడు. ఇక్కడొద్దుకానీ, నా మాటిని బేబమ్మగారి మిషనోడి దగ్గర కుట్టించుకోండి' అంది మాలచ్మి రహస్యంగా.

'ఏటే సెపుతున్నావు! పాపగార్లకి నామీద, మిషన్ తిరిగిందంటే రైలు చక్రం తిరిగినట్టే, ఆది జాకెట్ తెచ్చారాండే' అంటూ లేచాడు సూరన్న.

'వద్దండే! బంగారంలాంటి పట్టు సీర మీద జాకెట్, పాడైతే బాగోదు! ' అని అడ్డుపడబోయింది మాలచ్మి.

'పరవాలేదులే కుట్టనీ, ఇదిగో సూరన్నా! వచ్చే వారం పెళ్ళి, నువ్వు తడిపి ఆరేసి కుట్టడానికి చాల టైము ఉంది, ఈ సారి మాత్రం నన్ను తిప్పించుకోకుండా ఇచ్చేస్తే చాలు, కుట్టుకూలి మాలచ్మి కి ఇస్తున్నాను' అని అతను చూడకుండా ఆమె చేతిలో అయిదు వందలు ఉంచింది, చూస్తే మళ్ళీ, 'నా కూలీ పదమూడు రూపాయలే' అంటాడని తెలుసు తనకి!!

